క్లుప్తంగా

పెన్నాడ ఉప సర్పంచ్‌గా కోరం వెంకటేశ్వర్లు



కోరం వెంకటేశ్వర్లుకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారి వైభవతి

పాలకోడేరు: పెన్నాడ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా కోరం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఉప సర్పంచ్‌గా కొనసాగిన ఆరేపల్లి జయలక్ష్మి రెండున్నర సంవత్సరాలు ముగియడంతో రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక జరిగింది. సోమవారం జరిగిన ఈ ఎన్నికకు పాలకొల్లు మండల ఈఓ పీఆర్‌డీ కేఎం వైభవతి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈయనను గ్రామ సర్పంచ్ చిల్లా అనూష, వార్డ్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు ఆదాడ లక్ష్మి తులసి, ఆరేపల్లి పెద వెంకట స్వామి, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, మాజీ సర్పంచ్ మంతెన సుబ్రహ్మణ్యం రాజు, పంచాయతీ సిబ్బంది అభినందించారు.

అర్హులందరికీ పథకాలు



కాళీపట్నంలో పింఛన్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మొగల్తూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని కాళీపట్నం సొసైటీ చైర్మన్ దొంగ నాగముని తెలిపారు. కాళీపట్నం పడమర గ్రామంలో 11 మందికి నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు సోమవారం అందించారు. ఇప్పటికే గ్రామంలో 603 మందికి పింఛన్లు అందిస్తున్నామని, ఇంకా అర్హులుంటే పథకాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నాయకులు కవురు ఆదినారాయణ, జక్కంశెట్టి ఏడుకొండలు, పూతినేని నాగసత్యనారాయణ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల అందజేత

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ ముఖ్యమేనని స్పోర్ట్స్ కిట్స్ ఇన్‌చార్జ్ వి ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలో జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణ, మండల పరిధిలోని గ్రామాల్లో 75 ప్రాథమిక పాఠశాలలకు, 4 అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు, 14 ఉన్నత పాఠశాలలు, రెండు జూనియర్ కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ కిట్లను అందజేశామన్నారు. ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నమట్ల చిన్నయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నడిపూడిలో రహదారి నిర్మాణం

పెనుగొండ: నడిపూడి కట్టావారిపాలెం రహదారిని రూ.25లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. దశాబ్ద కాలంగా రహదారి లేక కట్టావారిపాలెం ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇటీవల గడపగడపకూ మన ప్రభుత్వంలో స్థానికులు మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లడంతో ఆయన రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. సర్పంచ్ కడలి బేబీ అన్నపూర్ణ, సొసైటీ అధ్యక్షుడు కె. గణపతి, ఉప సర్పంచ్ పూరిళ్ల శ్రీనివాస్, కడలి శ్రీను పర్యవేక్షించారు.

విద్యతోనే అభివృద్ధి

యలమంచిలి: విద్య ద్వారా కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని పాలకొల్లు మన్యం జగమ్మ సత్రం చైర్మన్ నంబూరి శ్రీ గంగా పవన్‌కుమార్ అన్నారు. కొంతేరు, మేడపాడులోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సోమవారం ఆయన నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. మేడపాడు ఎంపీటీసీ దేగల సూర్యప్రభ వెంకటేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కడలి రామలక్ష్మి పాల్గొన్నారు.

నేడు యువజన విభాగం ఆత్మీయ సమావేశం

మొగల్తూరు: మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వేంకటేశ్వర కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు మండల యూత్ అధ్యక్షుడు ఏగి రాజశేఖర్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరుకానున్నారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీలోని వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పోడూరు: అంటువ్యాధులు, జ్వరాల వ్యాప్తిపై ప్రజలు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సబ్ డివిజనల్ హెల్త్ ఆఫీసర్ రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. వద్దిపర్రులో హెల్త్ సబ్ సెంటర్‌ను సోమవారం ఆయన సందర్శించారు. గ్రామంలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వేలు నిర్వహించాలని చెప్పారు. రాజ్‌కుమార్ వెంట ఎంఎల్‌హెచ్‌పీ మేడిది అనిత, హెల్త్ అసిస్టెంట్ బొప్ప వెంకటరత్నం, ఏఎన్‌ఎం సత్యకుమారి, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కొత్త పింఛనుదారుల్లో ఆనందం

- పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపిక
- నాలుగు మండలాల్లో కొత్తగా 1194 మందికి లబ్ధి
- నియోజకవర్గంలో 35,307కు పెరిగిన లబ్ధిదారుల సంఖ్య





దివ్యాంగ బాలుడికి కొత్త పింఛను అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, అంతర చిత్రంలో ఆకివీడులో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్, కౌన్సిలర్ కట్టా రవీంద్రనాథ్ ఠాగూర్

ఆకివీడు: ఒకటో తేదీ వచ్చిందంటేనే పింఛను లబ్దిదారుల ఇళ్లల్లో పండుగ వాతావరణం వెల్లివిరుస్తోంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గడప వద్దకే వచ్చి లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తుండటంతో వారి ఆనందానికి అవధులు లేవు. గత ప్రభుత్వాల హయాంలో ఒకటో తేదీ వచ్చిందంటే పింఛను లబ్ధిదారులు అనేక వ్యయప్రయాసలకు గురయ్యేవారు. ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి ఆర్థికసాయం కోసం ఎండనకా, వాననకా గంటల తరబడి కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవారు. కొత్త ఫించన్ పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల్ని బతిమిలాడుకోవాల్సి వచ్చేది. ఈ దుస్థితికి చరమగీతం పాడి వలంటీర్ల వ్యవస్థతో పింఛను సొమ్మును ఒకటో తేదీ తెల్లవారుజామునే వారి ఇంటివద్దకు చేరే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలకు పింఛనుదారులు పండుగ చేసుకుంటున్నారు. ఉండి నియోజకవర్గంలో ఈ నెల కొత్తగా ఎంపికైన వారికి మంజూరైన పింఛను సొమ్మును లబ్ధిదారులకు ఇప్పటికే అందజేయడంతో వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది. ప్రతి నెలా కొత్త అర్హులను గుర్తించి వలంటీర్లు దరఖాస్తు చేయిస్తున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలోని ఆకివీడు మండలంలో 9,800, ఉండి నియోజకవర్గంలో 8,792, పాలకోడేరు మండలంలో 8,840, కాళ్ల మండలంలో 8,875 మంది కలిపి మొత్తం 36,307 మంది పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు ఉండగా, వారికి మొత్తం రూ.8,77,05,500 సొమ్ము పంపిణీ చేస్తున్నారు.

అర్హులందరికీ లబ్ధి



నియోజకవర్గంలో అర్హులందరికీ పింఛను పథకాన్ని పారదర్శకంగా అమలుజేస్తున్నాం. లబ్ధిదారుల్ని గుర్తించి వలంటీర్ల సహకారంతో వెల్ఫేర్ అసిస్టెంట్‌ల ద్వారా ఆన్‌లైన్ చేయించి మంజూరు చేయిస్తున్నాం. కొత్తగా 1,194 మందికి పింఛన్లు అందజేస్తున్నాం. ఇప్పటివరకు రూ.8.77 కోట్ల మేర పింఛను సొమ్ము పంపిణీ జరుగుతోంది.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

నియోజకవర్గంలో 1,194 కొత్త పింఛన్లు మంజూరు

ఉండి నియోజకవర్గంలో సెప్టెంబర్ నెలకు 1,194 కొత్త ఫించన్లు మంజూరు అయ్యాయి. ఆకివీడు మండలంలో 313, పాలకోడేరు మండలంలో 501, కాళ్ల మండలంలో 188, ఉండి మండలంలో 192 పింఛన్లు మంజూరు చేసి, నగదును లబ్ధిదారులకు అందజేస్తున్నారు. అర్హులైన కొత్త పింఛనుదారులతో ప్రతి నెలా దరఖాస్తులు వెల్లుతున్నాయి. ఆన్‌లైన్ దరఖాస్తులతో లబ్ధిదారులకు న్యాయం చేకూరుతోంది.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభాకరరావు



చందన ప్రభాకరరావు

ఆకివీడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా కోళ్లపర్రు గ్రామ ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందన ప్రభాకరావు ఎంపిక య్యారు. మంగళవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం రోజు అవార్డు ప్రదానం చేయనున్నారు. 2002లో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మండలంలోని తరటావ, కుప్పనపూడి, కోళ్లపర్రు గ్రామాల్లో పనిచేశారు. పనిచేసిన పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రిని 2019 వరకు అందజేస్తూ వచ్చారు. దాతల సహకారంతో విద్యార్థులకు పలు సేవాకార్యక్రమాలతో పాటు ఉత్తమ విద్యాబోధనను అందజేస్తున్నారు. గతంలో లయన్స్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా సత్కారం పొందారు. ప్రభాకరరావును పలువురు అభినందించారు.

నేడు ఉపాధ్యాయులకు సత్కారాలు

సాక్షి, భీమవరం: గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం మానవత సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సేవలందించిన ఆరుగురు ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు మానవత భీమవరం శాఖ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటపతిరాజు చెప్పారు. త్యాగరాజ భవనంలో ఉదయం 10 గంటలకు నడపన నాగేశ్వరరావు, కాకర్ల రాజరాజేశ్వరి, కేబీవీ మురళీకృష్ణ, కూనపరాజు మాధవి, జీపీసీ శేఖర్‌రాజు, దాయన సురేష్‌చంద్రజీలను పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎంఆర్ రాజు చేతుల మీదుగా సత్కరిస్తామన్నారు.

పోలీసు స్పందనలో 15 ఫిర్యాదులు

సాక్షి, భీమవరం: స్పందనలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. సోమవారం నిర్వహించిన పోలీసు స్పందనలో అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ స్పందనలో 15 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు.

స్పందనలో ఆరు ఫిర్యాదులు

ఆకివీడు: స్పందన కార్యక్రమంలో ఆరు ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ కందుల వాణీ సోమవారం చెప్పారు. వీటిని పరిశీలన నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించినట్లు వివరించారు.

తహసీల్దార్ మృతికి సంతాపం

ఉండి: ఉండిలో తహసీల్దార్ గా పనిచేసి బదిలీపై నర్సాపురం ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లిన ఎం. రవీంద్రకుమార్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి ఉండి మండల వీఆర్వోల సంఘం సంతాపం ప్రకటించినట్లు సంఘ మండల అధ్యక్షుడు ఎస్.చిన్నారావు తెలిపారు.

ఆపదలో అండగా సీఎం వైఎస్ జగన్



తుందుర్రులో వృద్ధులకు పింఛన్‌లు అందిస్తున్న సర్పంచ్ ఆరేటి పెద్దబ్బు

భీమవరం అర్బన్: బిడ్డలు చూడకపోవడంతో నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వికలాంగులకు, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు, ఆపదలో ఉన్నవారికి పింఛన్ ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని సర్పంచ్ ఆరేటి సత్య వెంకట వీరాస్వామినాయుడు (పెద్దబ్బు) అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో సోమవారం నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెద్దబ్బు మాట్లాడుతూ గత ప్రభుత్వాలలో నూతనంగా పింఛన్ మంజూరు కావాలంటే మండల కేంద్రాల్లో కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా వచ్చేవి కావన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పింఛన్‌లు మంజూరు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సారథ్యంలో నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దా పోలు రాజు, జడ్డు తాతాలు, చెల్లబోయిన అప్పారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతో చదవాలి



మురళీకృష్ణను అభినందిస్తున్న స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం, అధ్యాపకులు

నరసాపురం రూరల్: విద్యార్థులు పోటీతత్వంతో చదివి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కాకినాడ జేఎన్‌టీయూకి చెందిన ఇండస్ట్రీ ఇనిస్టిట్యూట్ ఇంట్రాక్షన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం నరసాపురం మండలం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అటానమస్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభం సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణతోపాటు స్వర్ణాంధ్ర ట్రెజరర్ త్రినాథ్, డైరెక్టర్ అద్దాల శ్రీహరి మాట్లాడుతూ నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తయ్యేలోపు సబ్జెక్టుపై పట్టుసాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆడిటర్ రాంబాబు, ప్రిన్సిపాల్స్ సురేష్‌కుమార్, పండరీనాథ్, హెచ్‌వోడీ స్వామినాథన్ వివిధ విభాగాల ప్రధాన అధ్యాపకులు కొంతమంది సీనియర్ విద్యార్థులు మాట్లాడారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో స్వర్ణాంధ్ర కళాశాల ఆవరణ కిక్కిరిసింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పెన్షన్లను సద్వినియోగం చేసుకోవాలి



రాయకుదురులో పెన్షన్లు అందజేస్తున్న దృశ్యం

వీరవాసరం: ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను లబ్ధిదారులు సద్వినియోగపర్చుకోవాలని గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి అన్నారు. రాయకుదురు గ్రామ సచివాలయం వద్ద నూతనంగా మంజూరైన వితంతు, వృద్ధాప్య పెన్షన్లను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమం పెద్ద ఎత్తున కొనసాగుతోందన్నారు. ప్రజలంతా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దుర్గా ప్రసాద్, పోలిశెట్టి శివన్నారాయణ, గెడ్డం భాస్కరరావు, లొల్ల సీతారాం ప్రసాద్, తానేటి ప్రసాద్, విప్పర్తి రాధాకృష్ణ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దాడి ఘటనలో వ్యక్తిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: దాడి ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. దెయ్యాలతిప్పకు చెందిన రామాని పూర్ణచంద్రరరావు సోదరితో బంధన వెంకటేశ్వరరావుకు వివాహం కాగా వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పదేళ్ల క్రితం పూర్ణచంద్రరరావు సోదరి మృతి చెందగా, ఆమె పిల్లలు పుట్టింటి వద్ద ఉంటున్నారు. 2023 సంవత్సరంలో బంధన వెంకటేశ్వరరావు రెండో వివాహం చేసుకున్నాడు. ఈ నెల 3వ తేదీన మొదటి భార్య పుట్టింటికి వెంకటేశ్వరరావు వచ్చి పిల్లలపై కేకలు వేస్తుండగా రామాని పూర్ణచంద్రరావు, ఆయన తల్లి ఎందుకు కేకలు వేస్తున్నావని నిలదీశారు. దీంతో పూర్ణచంద్రరావుపై వెంకటేశ్వరరావు దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్సై డి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవినీతిలో తిమింగలం చంద్రబాబు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఉచ్చుల స్టాలిన్ తదితరులు

పాలకొల్లు అర్బన్: అవినీతి, అక్రమాలకు పాల్పడి 18 కేసుల్లో కోర్టుల నుంచి స్టేలు తెచుకున్న ఘనుడు చంద్రబాబు నాయుడని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉచ్చుల స్టాలిన్ విమర్శించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదేశాల మేరకు యాళ్లవానిగరువు వైసీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమరావతిలో తాత్కాలిక భవనాల నిర్మాణం పేరుతో రూ.118 కోట్లు చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని దుయ్యబట్టారు. దీనిపై ఐటీ చంద్రబాబుకి నోటీసులు జారీ చేయడంతో టీడీపీ నేతలు పెదవి విప్పడం లేదన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్ర సంపదను దోచేశారని విమర్శించారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ తన తండ్రి చంద్రబాబు మింగేసిన రూ.118 కోట్లకి సమాధానం చెప్పాలని స్టాలిన్ డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌పై బురదజల్లే ప్రయత్నం చేస్తే వైసీపీ నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మరోసారి జగన్‌ను సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీను, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, పార్టీ నాయకులు బండి రమేష్, జమ్ము కాశి, బొంతు వెంకట కర్ణారెడ్డి, వీరా ఉమా శంకర్, కల్యాణం గంగాధరరావు, నిమ్మకాయల రామకృష్ణ పాల్గొన్నారు.

నాలుగేళ్లు కష్టపడితే నలభై ఏళ్ల జీవితం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు

తాడేపల్లిగూడెం: నాలుగేళ్లు కష్టపడితే నలభై ఏళ్ల సుఖవంతమైన జీవితం వస్తుందని వాసవీ ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ తొలి ఏడాది తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో వక్తలు తెలిపారు. పెదతాడేపల్లిలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ 22 ఏళ్ల క్రితం 180 మంది విద్యార్థులతో ప్రారంభించిన ఈ కళాశాల నేడు రాష్ట్రంలో పేరెన్నికగన్న కళాశాలగా ఎదిగిందని అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు అన్నారు. అటానమస్ స్థాయికి చేరి అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఆధునిక కోర్సులను విద్యార్థులకు అందిస్తోందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాలకవర్గ కోశాధికారి బాలకాశయ్య, సంయుక్త కార్యదర్శి పాబోలు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


జక్కరంలో కేంద్ర బృందం పర్యటన



జక్కరంలో డంపింగ్ యార్డుని పరిశీలిస్తున్న సెంట్రల్ టీమ్ సభ్యులు

కాళ్ల: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023 పురస్కారానికి ఎంపికైన జక్కరం గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షణ్ సెంట్రల్ టీమ్ సభ్యులు సోమవారం పర్యటించి పరిశీలించారు. మరుగుదొడ్ల వాడకం, రోడ్లు, డ్రెయినేజ్ క్లీనింగ్, ఇంటింటి చెత్త సేకరణ, చెత్త ప్రాసెసింగ్ సెంటర్‌లో వర్మి కంపోస్ట్ యూనిట్, డ్రైవేస్ట్ మేనేజ్‌మెంట్, షెడ్ దగర ఉన్న సొకర్యాలు పరిశీలించారు. అనంతరం గ్రామ సుందరీకరణ, సచివాలయ ప్రొఫైల్, రిజిస్టర్లు, రిపోర్ట్‌లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూచింపూడి పద్మావతీ, ఉప సర్పంచ్ లక్ష్మీపతిరాజు, ఎంపీటీసీ సభ్యులు వేగేశ్న విజయ, ఎంపీడీఓ జి.స్వాతి, డీపీఆర్సీ ఎస్.ఎడ్వర్డ్, పంచాయతీ కార్యదర్శి షేక్ జమాల్, స్వచ్ ఆంధ్ర కార్పొరేషన్ కో–ఆర్డినేటర్ దినేష్, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దుంపగడప కళాశాలలో కంటి పరీక్షలు



దుంపగడప కళాశాలలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: కంటి చూపు కోల్పోతే ప్రపంచమే అంధకారమవుతుందని ప్రిన్సిపాల్ కె.సుజాత అన్నారు. దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు, అధ్యాపకులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ కంటి చూపు కోల్పోకుండా చూసుకోవాలన్నారు. కంటిచూపు పెరగడానికి అవసరమైన ఆహారపు అలవాట్లను పెంచుకోవాలని సూచించారు. సైన్సు అధ్యాపకులు డాక్టర్ పీ.శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంతిని గుర్తించి నేత్ర నరాల ద్వారా మెదడుకు సమాచారం అందించే అవయవం కన్ను అన్నారు. కార్యక్రమంలో ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. శిబిరంలో 100 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు అందజేశారు.

ప్రజలను దగా చేసిన కేంద్రం



ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేతలు

సాక్షి, భీమవరం: రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంటూ దగా చేయడమేగాక ధరలను అదుపు చేయలేని కేంద్ర ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ కోరారు. ధరలను అదుపు చేయాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో దేశ సంపదను బడా పెట్టుబడిదారులకు దోచిపెట్టిందని దుయ్యబట్టారు. అనంతరం ఆర్డీవో రాజుకు వినతిపత్రం అందజేశారు. చైతన్య ప్రసాద్, డి.నాగు, డి.త్రిమూర్తులు, కె.కృష్ణ, ఒడిగి వెంకటేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలంటూ నిరసన

కాళ్ల: నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోలు, డీజిల్, కరెంట్ చార్జీలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలంటూ సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కాళ్లలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ప్రజలపై విపరీతమైన భారాలు వేస్తోందని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ కృష్ణారావుకి వినతిపత్రాన్ని అందజేశారు. మండా సూరిబాబు, తిరుమాని శ్రీను, నాగిడి ఆంజనేయులు, గరికముక్కల ఆజమ్మ పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని ధర్నా

ఆకివీడు: కేంద్ర ప్రభుత్వం తక్షణం ముడిసరుకుల ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు డీ.కల్యాణి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ నిత్యావసరాల ధరల తగ్గుదలకు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, బీ.రాంబాబు, ఎస్కే.వలీ పాల్గొన్నారు.

హామీలు విస్మరించిన ప్రధాని మోదీ

ఉండి: తాను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ధరలు తగ్గించి ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని వాగ్దానం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను మోసగించారని సీపీఎం జిల్లా నాయకుడు కలిదిండి రాజారామ్మోహన్‌రాయ్ విమర్శించారు. సీపీయం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి తొమ్మిదిన్నరేళ్లు అయినా చేసిన వాగ్దానాలు నెరవేర్చకపోగా ధరలు మూడింతలు పెంచారని మండిపడ్డారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.వీరాస్వామి నాయుడుకి వినతిపత్రాన్ని అందజేశారు. ధనికొండ శ్రీనివాస్, కిలారి తవిటి నాయుడు, రామకూరి వెంకటరత్నం, చీర్ల శేషు పాల్గొన్నారు.





